بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 18.01.2019 (Telugu)**

**యుద్ధములలో అమరులగుటను అనుచరులు ఎంతో ఆనందము, సంతోషముగా భావించేవారు హజ్రత్ అబూబకర్, ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు సేవ, వారితో కలిసి ప్రస్థానము చేయు అవకాశము పొందిన ఇతరులతో పాటు ఆమిర్ బిన్ ఫుహైరా ప్రత్యేకంగా ఎంతో అదృష్టవంతులు, వీరు విశ్వసనీయతకు దర్పణంగా నిలిచి ప్రతి సందర్భమున విశ్వసనీయతను చూపిరి, అల్లాహ్ తఆలా వీరి స్థాయి అంతస్థులను సదా పెంచుగాక!**

**ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బద్రి అనుచరులైన హజ్రత్ ఆమిర్ బిన్ ఫుహైరా సద్గుణముల విశ్వాసభరిత, ఆసక్తికర ప్రస్తావన**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 18.01.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

నేడు నేను హజ్రత్ ఆమిర్ బిన్ ఫుహైరా గురించి ప్రస్తావించెదను. వీరు అజ్ద్ తెగకు చెందినవారు. వీరు హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్హా తల్లి వరుస సోదరుడైన తుఫైల్ బిన్ అబ్దుల్లాహ్ బానిస. వీరు కూడ నల్ల జాతీయు బానిసలే. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దారె అర్ఖమ్‌నకు మారకముందే వీరు ఇస్లాం స్వీకరించిరి. వీరు హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హు మేకలను మేపేవారు. ఇస్లాం స్వీకరించిన తర్వాత అవిశ్వాసులు వీరిని చాలా బాధలకు గురి చేసిరి. కావున హజ్రత్ అబూబకర్ వీరిని కొనుగోలు చేసి స్వతంత్రత ప్రసాదించిరి. మదీనాకు ప్రస్థానము చేయు సమయమున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ అబూబకర్ సౌర్ గుహలో తలదాచుకున్నప్పుడు వీరు హజ్రత్ అబూబకర్ మేకలను మేపేవారు. మేకలను మా వద్దకు తీసుకొని రావలెనని హజ్రత్ అబూబకర్ వారిని ఆదేశించిరి. పగలంతా వీరు మేకలను మేపి సాయంత్రము సౌర్ గుహ వద్దకు మేకలను తీసుకొని వచ్చేవారు. వారిద్దరు అనగా ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ అబూబకర్ స్వయముగా మేకల పాలు పిండుకునేవారు. అబ్దుల్లాహ్ బిన్ అబీబకర్ వారిద్దరి అనగా ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ అబూబకర్ వద్దకు వెళ్ళినప్పుడు వారి అడుగు జాడలను మరొకరు గుర్తించకూడదని హజ్రత్ ఆమిర్ బిన్ ఫుహైరహ్ కూడ వారి వెనుక నడిచేవారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ అబూబకర్ సౌర్ గుహను వీడి మదీనాకు బయలు దేరినప్పుడు హజ్రత్ ఆమిర్ బిన్ ఫుహైర కూడ వారితో పాటు ప్రస్థానము చేసిరి. హజ్రత్ అబూబకర్ వారిని తమ వెనుక కూర్చొనబెట్టుకొనిరి. అప్పుడు వారికి బనూ దీల్‌నకు చెందిన ఒక వ్యక్తి దారి చూపుచుండెను. హజ్రత్ ఆమిర్ బిన్ ఫుహైర బదర్, ఉహద్ యుద్ధములో పాల్గొనిరి. బిరె మవూన సందర్భమున 40 సంIIల వయసులో వీరు అమరులైరి.

హజ్రత్ అబూబకర్ ప్రస్థానము కంటే ముందు అల్లాహ్ తఆలా మార్గములో హింసలకు గురగుచున్న ఏడుగురు బానిసలను విడిపించి స్వతంత్రతనిచ్చిరి. వీరిలో హజ్రత్ బిలాల్, హజ్రత్ ఆమిర్ బిన్ ఫుహైర కూడ యుండిరి. ప్రస్థానమును వివరించుచు హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్హా ఇట్లు ఉల్లేఖించిరి.

ఒక రోజు మేము మా గృహములో కూర్చొనివుండగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ తల కప్పుకొని వచ్చుచున్నారని ఒక వ్యక్తి అబూబకర్‌కు తెలిపెను. ఇంతలోనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చేరుకొని లోపలికి ప్రవేశించుటకు అనుమతి కోరిరి. హజ్రత్ అబూబకర్ అనుమితి ఇవ్వగా వారు లోపలికి వచ్చిరి. ప్రస్థానము చేయుటకు నాకు అనుమతి లభించినదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. నా తల్లిదండ్రులు మీ కొరకు త్యాగమగుదురు గాక! ఓ దైవ ప్రవక్త! నన్ను కూడ మీతో తీసుకెళ్ళగలరని హజ్రత్ అబూబకర్ వేడుకొనిరి.

అవును, నీవు కూడ నాతో వెళ్ళమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బదులిచ్చిరి. అనంతరం హ్రజత్ అబూబకర్ నా తల్లిదండ్రులు మీ కొరకు త్యాగమగుదురు గాక! కలిసి పోవుచున్నందున నా వద్ద నున్న ఈ రెండు ఒంటెలలో ఒక దానిని మీరు తీసుకోగలరని విన్నవించుకొనిరి. ధర చెల్లించి తీసుకుంటానని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. హ్రజత్ ఆయిషా ఇట్లనిరి. కావున మేము త్వరత్వరగా ఇద్దరికి ప్రయాణ సామాగ్రి సిద్ధము చేసితిమి. వారి కొరకు మేము ప్రయాణ సామాగ్రి సిద్ధము చేసి తోలు సంచిలో పెట్టితిమి. హ్రజత్ అబూబకర్ కుమార్తె హ్రజత్ అస్మా తన నడుము కట్టులోని కొంత భాగమును కత్తిరించి సంచికి కట్టిరి. కావున వారి పేరు జాతన్నతాఖ్ పడినది. అనంతరం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, హ్రజత్ అబూబకర్ సౌర్ పర్వతములో గల గుహకు చేరుకొని అందులో మూడు రాత్రులుండిరి. హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ అబీబకర్ వారిద్దరి వద్దకు రాత్రి వెళ్ళేవారు. అనంతరం చీకటిలోనే తిరిగి వచ్చేవారు. మక్కాలో మాతో రాత్రి గడిపినట్లు ఖురైష్ భావించేవారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, హ్రజత్ అబూబకర్ బనూ దీల్ తెగకు చెందిన ఒక వ్యక్తిని దారి చూపుటకు కూలీపై నియమించుకొనిరి. అతడు బనూ అబ్ద్ బిన్ అదీ వంశస్తుడు. మార్గము చూపుటలో అతడు దిట్ట. అతడు ఖురైష్ అవిశ్వాసుల మతమునే ఆచరించేవాడు. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం, హ్రజత్ అబూబకర్ ఇద్దరు అతణ్ణి నమ్మి, తమ ఒంటెలను అతనికి అప్పగించిరి. సౌర్ గుహ వద్దకు ఒంటెలను తీసుకొని మూడు రోజుల తర్వాత ఉదయం రావలెనని అతనితో వాగ్దానము తీసుకొంటిరి. ఆమిర్ బిన్ ఫుహైరహ్, మార్గదర్శకుడు వారిద్దరితో కలిసి వెళ్ళిరి. ఆ మార్గదర్శకుడు ఈ ముగ్గురిని సముద్ర తీరము గుండా తీసుకొని వెళ్ళెను.

సురాఖ బిన్ మాలిక్ బిన్ జౌష్ ఇట్లు ఉల్లేఖించిరి. మా వద్దకు ఖురైష్ అవిశ్వాసుల ప్రతినిధులు వచ్చిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, అబూబకర్ ఇద్దరిని హత్య చేసిన లేదా బంధించిన వ్యక్తికి బహుమతి ప్రకటించిరి. నేను నా జాతి బనూ మద్లజ్ సమావేశములో కూర్చొనివుండగా ఒక వ్యక్తి వచ్చి ఇట్లనెను. సురాఖ! నేనిప్పుడే సముద్రము తీరాన కొందరి ఛాయలను చూచినాను. వారు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి సహచరులే అని నేను భావించుచున్నాను. సురాఖ ఇట్లనిరి. కొంత సమయము తర్వాత నేను లేచి ఇంటికి వెళ్ళి నా గుర్రమును సిద్ధము చేయమని నా బానిసరాలికి చెప్పితిని. గుర్రము అతి వేగంగా పరుగెత్తుకుంటు నన్ను తీసుకెళ్ళెను. తుదకు నేను వారిని సమీపించగా అనగా ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంను సమీపించగా నా గుర్రము తట్టు తగిలి పడిపోయినందున నేను కూడ పడిపోతిని. నేను లేచి నిలబడి నా విల్లు నుండి బాణము తీసుకొని వారికి నష్టము కలిగించగలనా లేదా అని పరీక్షించుకుంటిని. పరీక్ష నాకు వ్యతిరేకంగా వెలువడెను. వెలువడిన పరీక్షకు విరుద్ధంగా నేను నా గుర్రము పరుగెత్తించితిని. గుర్రము అతి వేగంగా నన్ను తీసుకెళ్ళు చుండెను. నేను వారిని ఎంతగా సమీపించినాననగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఖుర్‌ఆన్ చదువుచున్నట్లు నేను వింటిని. వారు సల్లల్లాహు అలైహి వసల్లం అటు ఇటు చూచేవారు కాదు. కాని హ్రజత్ అబూబకర్ తరచుగా తిరిగి తిరిగి చూచేవారు. నా గుర్రపు ముందటి కాళ్ళు మోకాళ్ళ వరకు భూమిలో దిగినందున నేను మరల పడిపోతిని. నేను మరొక్కసారి బాణములతో పరీక్షించుకుంటిని. నా ఇష్టమునకు వ్యతిరేకంగా పరీక్ష వెలువడెను. అనగా నేను ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంను పట్టుకోలేను. అప్పుడు నేను మీకెలాంటి నష్టము వాటిల్లదని వారిని పిలిచితిని. కావున వారు ఆగిపోయిరి. వారిని చేరుటకు కలుగుచున్న ఆటంకముల వలన తప్పక రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం విజయము సాధింతురని నాకు నమ్మకము కలిగెను. అవిశ్వాసుల దురుద్దేశములన్నిటిని నేను ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిపితిని. మా ప్రయాణము గురించి ఎవరికి చెప్పకూడదని ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచించిరి. నాకు శాంతి పత్రము వ్రాసివ్వగలరని నేను ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంను వేడుకొంటిని. పత్రము వ్రాయమని వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఆమిర్ బిన్ ఫుహైరాతో అనిరి. అతడు చర్మపు ఒక ముక్కపై వ్రాసిచ్చెను. అనంతరం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బయలు దేరిరి.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా నుండి బయలు దేరినారని మదీనాలో ముస్లిములు వినివుండిరి. అందుకే వారు ప్రతి రోజు ఉదయం హ్రర్రహ్ ప్రాంత మైదానమునకు వచ్చి నిరీక్షించేవారు. మధ్యాహ్నము ఎండ తీవ్రత వలన తిరిగి వెళ్ళిపోయేవారు. ఒక రోజు ఒక యూదుడు ఏదో చూడడానికి తన భవనముపైకి ఎక్కగా

అతడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం , వారి సహచరులను చూచెను. యూదుడు ఉద్రేకముతో అనుకోకుండానే పెద్ద ధ్వనితో ఇట్లు ప్రకటించెను. ఓ అరబ్ ప్రజలారా! అనగా మదీనా వాసులారా! మీరు నిరీక్షించుచున్న నాయకుడు వచ్చెను. ఇది వినగానే ముస్లిములు తమ ఆయుధములను ధరించి హర్రహ్ మైదానమునకు చేరుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను స్వాగతించిరి. వారు వారిని వెంట తీసుకొని తమ కుడి వైపు తిరిగి బనూ అమర్ బిన్ ఔఫ్ విధిలో వారి వద్ద దిగిరి. ఇది సోమవారము కాగా రబీవుల్ అవ్వల్ నెల. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బనూ అమర్ బిన్ ఔఫ్ విధీలో 10 రోజుల కంటే ఎక్కువే బస చేసిరి. ధర్మబద్ధత పునాదితో అక్కడ మస్జిద్ నర్మించిరి. ఇందులో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నమాజ్ చదివిరి. అనంతరం వారు తమ ఒంటెపై సవారైరి. ప్రజలు వారితో నడవడం మొదలు పెట్టిరి. ఇప్పుడు మస్జిద్ నబ్వీ వున్న చోట ఆ ఒంటె నిలిచెను. అప్పుడక్కడ కొందరు ముస్లిములు నమాజ్ చదివేవారు. అక్కడ సుహైల్, సహల్ తమ ఖర్జూరములను ఎండబెట్టేవారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ ఇద్దరు బాలురను పిలిపించుకొని ఇక్కడ మస్జిద్ నిర్మించుటకు ఈ స్థల ధరను అడిగిరి. ఓ రసూలుల్లాహ్! మేము ఈ భూమిని మీకు ఉచితంగా ఇస్తామని ఆ ఇద్దరు అనిరి. ఉచితంగా భూమిని తీసుకొనుటకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిరాకరించి, వారితో కొనుగోలు చేసిరి. ఈ మస్జిద్ నిర్మాణము కొరకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలతో పాటు ఇటికెలు మోసిరి. ఇటికెలు మోస్తుండగా ఇట్లనేవారు. اَللّٰهُمَّ اِنَّ الْاَجْرَ اَجْرُ الْاٰخِرَة فَارْحَمِ الْاَنْصَارَ وَالْمُهَاجِرَ అనగా ఓ అల్లాహ్! నిజమైన ఫలితము పరలోక ఫలితమే. నీవు అన్సార్, ముహిజరల్లను కరుణించుము.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఈ సంఘటనను తమ పద్ధతిలో ఇట్లు ప్రస్తావించిరి. వారిట్లు వ్రాసిరి. మక్కా నివాసులు వారి (సల్లం) ను అన్వేషించుటలో విఫలమైనప్పుడు వారిట్లు ప్రకటించిరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం లేదా అబూబకర్‌ను సజీవంగా లేదా మృతులుగా మాకు అప్పగించిన వారికి 100 ఒంటెలను బహుమతిగా ఇచ్చెదము. ఈ ప్రకటన వార్త మక్కా చుట్టు ప్రక్కలలో గల తెగలకు కూడ పంపబడెను. కావున ఒక గ్రామీణ నాయకుడైన సురాఖ బిన్ మాలిక్ ఈ బహుమతి ఆశతో వారిని వెంబడించెను. అన్వేషించుచు అతడు మదీనా మార్గములో వారిని చూచెను. రెండు ఒంటెలపై నున్న వ్యక్తులను అతడు చూడగానే ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి సహచరులని అతడు అర్థము చేసుకొనెను. కాని దారిలో గుర్రమునకు పెద్ద తట్టు తగిలినందున సురాఖ పడిపోయెను. సురాఖ తర్వాత ఇస్లాంలో చేరెను. అతడు తన ఈ సంఘటనను స్వయముగా ఇట్లు తెలిపేవాడు.

హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశము మేరకు ఆమిర్ బిన్ ఫుహైరహ్ శాంతి పత్రము వ్రాసిచ్చిన తర్వాత సురాఖ తిరిగి వెళ్ళిపోవుచుండగా అల్లాహ్ తఆలా సురాఖ భవిష్యత్తును వారి సల్లల్లాహు అలైహి వసల్లం పరోక్షముగా చూపెను. అతనితో వారిట్లనిరి. నీ చేతిలో కిస్రా కడియములు తొడగబడినప్పుడు నీ పరిస్థితి ఎట్లుండును. కిస్రా బిన్ హుర్ముజ్ ఈరాన్ చక్రవర్తివా? అని అశ్చర్యముతో సురాఖ అడిగెను. అవునని వారనిరి. వారి ఈ భవిష్యవాణి సుమారు 16, 17 సంవత్సరముల తర్వాత పూర్తయ్యెను. సురాఖ ఇస్లాంలో చేరి మదీనాకు వచ్చెను. పెరుగుచున్న ఇస్లాం వైభవమును చూచి ఈరానీయులు ముస్లిములపై దాడులు చేయడం మొదలు పెట్టిరి. ఇస్లాం అణగదొక్కే బదులు తామే స్వయంగా ఓటమికి గురైరి. కిస్రా రాజధాని ఇస్లామీయ సైనికుల గుర్రముల పాదములతో తొక్కబడెను. ఈరాన్ నిధులు ముస్లిముల వశమయ్యెను. ఈరాన్ సాంప్రదాయము ప్రకారమే కిస్రా సింహాసనముపై కూర్చునే ముందు ధరించే ఆ కడియములు కూడ యుద్ధ సామాగ్రిలో ముస్లిములకు లభించెను. హజ్రత్ ఉమర్ వద్ద ఆ యుద్ధ సామాగ్రి ప్రేవశపెట్టబడినప్పుడు కిస్రా కడియములను వారు చూచిరి. అప్పుడు దైవ మహిమ వారి కనుల ముందు తిరిగెను. సురాఖను పిలవమని వారనిరి. సురాఖ రాగానే కిస్రా కడియములను ధరించవలెనని హజ్రత్ ఉమర్ వారిని ఆదేశించిరి. ఓ దైవ ప్రవక్త ఖలీఫాగారు! బంగారము ధరించుట ముస్లిములకు నిషేధమని సురాఖ వేడుకొనెను. హజ్రత్ ఉమర్ ఇట్లనిరి. నీ చేతులలో బంగారపు కడియములను అల్లాహ్ తఆలా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు చూపెను. నీవు ఈ కడియములను ధరించుతావా లేక నేను నిన్ను శిక్షంచనా? ఆ కడియములను సురాఖ తమ చేతులకు ధరించెను. ఈ మహా గొప్ప భవిష్యవాణి పూర్తయినట్లు

ముస్లిములు ప్రత్యక్షంగా తిలకించిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఆమిర్ బిన్ ఫుహైరహ్ ప్రస్థానము చేసి మదీనాకు చేరుకొనగా అక్కడ వారు రజి, హ్రజత్ అబూబకర్ రజి, హ్రజత్ బిలాల్ రజి అనారోగ్యానికి గురైరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రార్థన చేయగా వారికి స్వస్థత కలిగెను. వారిని పరామర్శించుటకు హ్రజత్ ఆయిషా అనుమతి కోరగా వారు అనుమతినిచ్చిరి. వారు నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఆయా అనుచరుల స్థితిగతులు, వారి అభిప్రాయలను తెలిపిరి. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఆకాశము వైపు చూచి ఇట్లు ప్రార్థన చేసిరి.

اَللّٰهُمَّ حَبِّبْ اِلَيْنَا الْمَدِيْنَةَ كَمَا حَبَّبْتَ اِلَيْنَا مَكَّةَ واشد اَللّٰهُمَّ بَارِكْ لَنَا فِيْ صَاعِهَا وَفِيْ مُدِّهَا وَانْقُلْ وَبَاهَا اِلٰى مَا يعا

అనగా ఓ అల్లాహ్! మాకు మక్కాను ప్రియమైనదానిగా చేసినట్లే మదీనాను కూడ ప్రియమైనదిగా చేయుము. లేదా అంతకంటే ఎక్కువ. ఓ అల్లాహ్! మా కొరకు దీని పంట ఫలములలో శుభము కలిగించుము. మదీనాను మా కొరకు ఆరోగ్యవంతముగా చేయుము. ఈ అనారోగ్యము గాలిని మా నుండి దూరము చేయుము.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఆమిర్ బిన్ ఫుహైరహ్ బిరె మవూన సంఘటనలో అమరులైరి. హ్రజత్ ఆమిర్ బిన్ ఫుహైరహ్ రజి అమరత్వ సంఘటనను తెలుపుచు హ్రజత్ ముస్లిహ్ మౌవూద్ రజి, ఇట్లు తెలిపిరి. ఇస్లాం ఖడ్గముతో విజయము సాధించలేదు. హృదయములను ఆకట్టుకునే, ప్రవర్తనలలో అద్భుత మార్పు సృష్టించే గొప్ప బోధనతో ఇస్లాం విజయము సాధించెను. ఒక అనుచరులు ఇట్లు ఉల్లేఖించిరి. నేను ఇస్లాంలో చేరడానికి ఏకైక కారణమిట్లు గలదు. మోసమునకు పాల్పడుచు ముస్లిముల 70 చదువరులను హతమార్చిన తెగలో నేను అతిథిగా వుంటిని. చివరకు ఆమిర్ బిన్ ఫుహైరహ్ అను నామముగల ఒకే అనుచరులు మిగిలియుండిరి. చాలా మంది కలిసి వారిని పట్టుకొనిరి. మరో వ్యక్తి గట్టిగా వారి యదలో బర్ఛీని దించెను. బర్ఛీ తగలగానే వారి నోట فزت ورب الكعبة అనగా కాబా దేవుని ప్రమాణముగా నేను సఫలమైనాను అని వారి నోట వెలువడెను. వారి నోట ఈ వాక్యము వినగానే నేను చాలా ఆశ్చర్యానికి గురైతిని. ఒక వ్యక్తి తమ బంధువులతో దూరంగా, తమ భార్యా పిల్లలతో దూరంగా ఇంతటి ఘోర ఆపదలో చిక్కుకొన్నాడు. బర్ఛీ అతని యదలో దిగినది. అయినను అతడు మరణించే సమయమున కాబా దేవుని ప్రమాణముగా నేను సఫలమైనాను అని మాత్రమే అన్నాడు. దీని వలన నేను ఎంతో ప్రభావితమైతిని. వీరి కేంద్రమునకు చేరి, స్వయంగా వీరి మతము గురించి తెలుసుకుంటానని సంకల్పించితిని. కావున నేను మదీనా చేరుకొని ఇస్లాంలో చేరితిని.

హ్రజత్ ముస్లిహ్ మౌవూద్ రజి ఇట్లనిరి. యుద్ధములలో అమరులగుటను అనుచరులు ఎంతో సుఖము, సంతోషముగా భావించేవారు. యుద్ధములో వారికి కలిగిన బాధను దుఃఖముగా కాక సుఖముగా భావించేవారు. హ్రజత్ అబూబకర్, ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు సేవ, వారితో కలిసి ప్రస్థానము చేయు అవకాశము పొందిన ఇతరులతో పాటు ఆమిర్ బిన్ ఫుహైరా ప్రత్యేకంగా అదృష్టవంతులు, వీరు విశ్వసనీయతకు దర్పణంగా నిలిచి ప్రతి సందర్భమున విశ్వసనీయతను చూపిరి, అల్లాహ్ తఆలా వీరి స్థాయి అంతస్థులను సదా పెంచుగాక!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

.............................................................................................

.............................................................................................

.............................................................................................